క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామానికి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఎం.బసవరాజు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు మార్చటం, లైన్ల మరమ్మతుల కారణంగా దొడ్లేరు గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

సత్తెనపల్లి ఏడీఈగా రాజశేఖర్ బాబు



సత్తెనపల్లి: విద్యుత్ శాఖ సత్తెనపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏడీఈ)గా కొచ్చర్ల రాజశేఖర్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఏడీఈగా పని చేస్తూ బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. 1990లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించిన ఆయన అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం సత్తెనపల్లి ఏడీఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు లేకుండా అందరి సహకారంతో మెరుగైన సేవలు అందిస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో తాళ్ళూరి మోహన్‌బాబు, దేవతి సుబ్బారావు, కొత్త లక్ష్మయ్య, జవ్వాజి రామ్మోహన్‌రావు, డీ.శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమద్దీక్షా పరులు తెల్లవారుజామున 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం హరేరామ నామ సంకీర్తన జరిగింది. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. 16న తిరునాళ్ల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి



పెదకూరపాడు: అత్యంత సమస్యాత్మక గ్రామమైన గారపాడులో గురువారం క్రోసూరు సీఐ మంగరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా మంగరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత పోలింగ్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు శాంతియుతంగా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. వారి వెంట ఎస్ఐలు విపర్ల వెంకట్రావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండ రాముని గ్రామోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని రైలు గేటు సమీపంలో కోదండ రామాలయానికి ధ్వజస్తంభ ప్రతిష్టాపనా మహోత్సవం సందర్భంగా గురువారం అంకురార్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గో పూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధన, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం నిర్వహించారు. ప్రతిష్టింప చేసే జీవధ్వజ స్తంభం, సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామ స్వామి వార్ల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాయి దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామా నంద ప్రభూజీ(హైదరాబాద్), ధ్వజస్తంభ దాతలు వరికల్లు కోటేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

27 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని 2వ సచివాలయంలో 90 రోజుల కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డుల్లోని 27 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కాగా గురువారం పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, 2వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాదిగొండ నారాయణలు పేదల స్థల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని ఉపేక్షించేది లేదు

- వ్యాపారస్తులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాం
- ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రోత్సాహమిచ్చాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన అనిల్‌కుమార్ యాదవ్

సత్తెనపల్లి: ఆర్యవైశ్యులు శాంతి సమానులు.. శాంతియుతంగా ఉండాలని కోరుకుంటారు.. ఆర్యవైశ్యులు కోరుకున్న విధంగానే రౌడీయిజానికి అవకాశం లేకుండా నియోజకవర్గంలో వేధింపులు లేని పరిపాలన అందించామని, వ్యాపారస్తులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. సత్తెనపల్లిలోని గోశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి జరిగిన నియోజకవర్గ స్థాయి వ్యాపార వర్గాల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ రౌడీయిజాన్ని ఉపేక్షించేది లేదన్నారు. ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రోత్సాహాన్ని ఇచ్చి అండగా నిలిచామన్నారు. 2014లో ఓటమి పాలైనప్పటికీ 2019లో మళ్లీ అవకాశం రావడంతో చల్లంచర్ల సాంబశివరావు కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ అవకాశాలు కల్పించామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జ్ పి.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అంబటి రాంబాబు అన్న ఏ వర్గాన్ని ఇబ్బంది పెట్టేవాడు కాదని, మాట కరుకు మనసు వెన్న అన్నారు. అంబటి రాంబాబు గెలుపుకు సహకరించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, ఆర్యవైశ్య నాయకులు వెలుగూరి సుబ్బరాయుడు, పెరుమాళ్ళ లక్ష్మీ శివనారాయణ, అచ్యుత శివప్రసాద్, కూకుట్ల శ్రీను, కొత్త లక్ష్మయ్య, తల్లం సతీష్, చందోలు సూర్యప్రకాశరావు, కొత్త రామకృష్ణ, కట్టమూరి అప్పారావులు మాట్లాడారు. సమావేశంలో డాక్టర్ యక్కల సుధాకర్, ఆర్యవైశ్య నాయకులు రావిక్రింది మల్లికార్జునరావు, పాట్టి రాజేశ్వరరావు, దేవతి సుబ్బారావు, దూపగుంట్ల పూర్ణచంద్రరావు, శింగరి మధుసూధన్‌రావు, మాడా రమేష్, దేవతి సాంబశివరావు, బచ్చు మురళి, దూపగుంట్ల పవన్, దేవిశెట్టి మోహన్, అన్నం సత్యనారాయణ, కూరపాటి బసవయ్య, పెరుమాళ్ళ అమర్, చిల్లంచర్ల కళ్యాణ్, బచ్చు మురళి, జవ్వాజి రవి, దేసు హరనాథ్‌బాబు, పాట్టి మురళి తదితరులు ఉన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

మతతత్వ పార్టీలను నమ్మొద్దు

సత్తెనపల్లి : మతతత్వ పార్టీలను నమ్మొద్దని, భవిష్యత్తులో ముస్లిం మైనార్టీలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన రిజర్వేషన్లను ఎత్తివేస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 29వ వార్డులో ముస్లిం మైనార్టీ వర్గాలతో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక, వారు చేసింది చెప్పలేక కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. ఒంటరిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే శక్తి లేక ఒకప్పుడు తిట్టుకున్న... కొట్టుకున్న, దూషించుకున్న పార్టీలన్నీ సిగ్గు విడిచి ఏకమై పెత్తందారుల వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. పేదల పక్షాన నిలిచి, సంక్షేమాన్ని పారదర్శకంగా అందించిన జగన్‌మోహన్ రెడ్డికి మీరు అండగా ఉండాలని అభ్యర్థించారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు నివాసం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డులో పర్యటించారు. నాయకులు, క్రియాశీలక కార్యకర్తలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, యాంపాటి కోటిరెడ్డి, ముస్లిం మైనార్టీ వర్గాల నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు ఉన్నారు.

మరింత అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సర్పంచ్ గంగయ్య చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



రాజీవ్‌నగర్ కాలనీలో ఓ దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత 5 సంవత్సరాలలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చా.. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు మంజూరు చేయించానని, మరొక్కసారి ఆశీర్వదించి మరింత అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. మండలంలోని అంబడిపూడి సర్పంచ్‌గా కొమ్మవరపు గంగయ్య ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న కొమ్మవరపు స్వరాజ్యలక్ష్మి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల స్వరాజ్యలక్ష్మి సుదీర్ఘ సెలవు పెట్టడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న గంగయ్యను సర్పంచ్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గంగయ్య కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామానికి ఏ సహాయం కావాలన్నా తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. అలవికాని హామీలతో మోసం చేసేందుకు వచ్చే టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దని, ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ముందుగా కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే శంకరరావును భారీ ర్యాలీతో గ్రామంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు కొమ్మవరపు జవహర్‌బాబు, దార్ల వెంకటేశ్వర్లు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి పాల్గొన్నారు.

మీ ఇంటికి మంచి జరిగిందా.. అయితే మళ్లీ ఆశీర్వదించండి

అచ్చంపేట: గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని బేరీజు వేసుకోండి... మీ ఇంటికి మంచి జరిగిందా..లేదా.. ఆలోచించండి, మంచి జరిగిందనుకుంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించండి అంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం అచ్చంపేటలోని మెయిన్‌రోడ్డు, చామర్రు రోడ్డు, రాజీవ్‌నగర్ కాలనీలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎవరికి ఎంత లబ్ధి చేకూరిందో కూడా వివరించారు. ఒక్కొక్క ఇంటికి రూ.50 వేల నుంచి లక్షన్నర రూపాయల వరకు లబ్ధి పొందిన వారున్నారు. పథకాలను పొందిన వారందరితో ముఖాముఖి మాట్లాడారు. రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటు వేస్తే పథకాలన్నింటినీ తిరిగి పొందవచ్చని చెప్పారు. చిరు వ్యాపారులను, తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునేవారిని, పలు షాపుల వారిని ఆప్యాయంగా పలకరించారు. రానున్న కాలంలో అచ్చంపేటకు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, గ్రామ సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సాతర్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, అచ్చంపేట పార్టీ కన్వీనర్ షేక్ సమరం, రౌతు గోపి, గంజినబోయిన రామచంద్రరావు ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం



పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో గద్దె చలమయ్య, నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా–కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమానికి కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మామిడి జగన్నాథరావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, నాయకులు ధరణికోట విమల, యువజన సంఘ నాయకులు జడ రాజ్‌కుమార్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మక్కపాటి నరసింహారావు, బగ్గి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జె.భగత్, బి.రామారావు, అనంత వెంకట్‌నారాయణ, జగన్, వెంకటేశ్వర్లు, సుధా పాల్గొ న్నారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

నకరికల్లు: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మార్చి 14న రైతులు నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈవూరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఉద్యమానికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం పలు హామీలతో రైతుల సమ్మెను విరమింపజేసిందన్నారు. నేటికీ ఆ హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. డిమాండ్లు నెరవేర్చాలంటూ ఢిల్లీ బయలుదేరిన రైతులపై దారుణ చర్యలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి మూజావర్ జాన్‌అహ్మద్, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, రైతు సంఘం కార్యదర్శి ఈవూరి అప్పిరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి గోదా వెంకటరమణ, దేవంగి ఇస్మాయిల్, షేక్ లాలూ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతులకు మద్దతుగా నిరసన

ముప్పాళ్ళ: ఢిల్లీ రైతులకు మద్దతుగా కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత 14 నెలల క్రితం రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. రైతులకు బీజేపీ ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందన్నారు. మరలా రైతాంగం ఢిల్లీలో ఉద్యమానికి సిద్ధమైన సందర్భంలో మద్దతుగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గారా జాలయ్య, మార్పుల వెంకటరెడ్డి, తౌరటి అమర లింగేశ్వరరావు, కందిమళ్ళ సాంబశివరావు, ఇందూరి సత్యనారాయణరెడ్డి, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, తోట బ్రహ్మయ్య, తొండపి మస్తాన్‌రావు, నూకారపు సాంబశివరావు పాల్గొన్నారు.

చదువుకు ఆరంభమే తప్ప అంతం లేదు

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాలి సైద్



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఏజీపీ బాలి సైద్.

సత్తెనపల్లి: మనం చదివే చదువు వంద మార్కుల కోసం కాకుండా వంద సంవత్సరాల భవిష్యత్తు కోసం అని భావించి చదువుకోవాలని, చదువుకు ఆరంభమే తప్ప అంతం లేదని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ బాలి సైద్ అన్నారు. పట్టణంలోని రఘురామ నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ (సత్తనపల్లి) ఆధ్వర్యంలో రాజమండ్రికి చెందిన జి.రాజేష్, శ్రీలత దంపతుల సహకారంతో పదవ తరగతి బాలికలకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీవిద్య హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగ శ్రీవిద్య, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది బాబురావు, హిందీ ఉపాధ్యాయులు సుభాని, హాస్టల్ వార్డెన్ ఇందిరా గాంధీ, ట్యూటర్ విజయ, విద్యార్థినులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన పార్టీలను నమ్ముకుంటే ఎలాంటి ప్రయోజనం లేదని, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించే వైఎస్సార్‌సీపీనే మేలని నమ్మిన అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తాజాగా మాదిపాడుకు చెందిన లంక గోపి, ప్రకాష్, సురేష్, చింతరాల శ్రీను తదితరులు తమ అనుయాయులతో గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో మాదిపాడు సర్పంచ్ మాదా వెంకట్రావు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, చిట్యాల దావీదు, తదితరులు పాల్గొన్నారు.

పొరుపల్లిలో కొత్తగా ఐదు జ్వరం కేసులు



పొరుపల్లి(క్రోసూరు): పొరుపల్లిలో వైద్య శిబిరం గురువారం కొనసాగింది. జ్వరం కేసులు కొత్తగా ఐదు నమోదు అయినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మబాయి తెలియజేశారు. శిబిరంలో 21 మంది సాధారణ జలుబు, దగ్గు, ఒళ్లు, కాళ్ల నొప్పులు, షుగర్, బీపీ రోగులు రాగా వారికి వైద్య పరీక్షలు చేసి వైద్యం అందించటం జరిగిందన్నారు. ముగ్గురు జ్వర పీడితులను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వైద్యురాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు జ్యోతిర్మయి, రజిని, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ కూచిపూడి ప్రభావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల ప్రదర్శన



నకరికల్లు: సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థుల పురోగతికి తోడ్పడుతుందని హెచ్‌ఎం రాయపాటి శివనాగేశ్వరరావు అన్నారు. కుంకలగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగమహేశ్వరపురంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న తాను హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ సైన్స్ అనే పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహిస్తూ సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంచడం కోసం ప్రయోగాలు చేయిస్తున్నట్లు తెలిపారు. పలురకాల సైన్స్ ప్రయోగాలు చేస్తూ, విద్యార్థుల చేత చేయిస్తూ శాస్త్రవిజ్ఞానంపై ఆసక్తిని కలిగించే విధంగా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాకెట్ పనిచేసే విధానం, విమానం ఎగరడంలో ఇమిడి ఉన్న సూత్రం ఇలా 100కు పైగా ప్రయోగాలు చేసి చూపారు. నిత్యం మనం వాడే వస్తువులు, మనం వినే శబ్దాలలో దాగి ఉన్న సైన్స్‌ను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీరాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంకరరావు, ఎస్ఎం జియాఉద్దీన్

- అభ్యర్థిని ప్రకటించిన రోజే టీడీపీకి ఎదురుదెబ్బ
- 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. చంద్రబాబు ఎమ్మెల్యే అభ్యర్థిని ఇలా ప్రకటించగానే అలా అమరావతి ముస్లిం కాలనీలో టీడీపీ కోటకు బీటలు పడ్డాయి. ఇన్నాళ్లు ఆ పార్టీకి అండగా నిలిచిన వారంతా ఇప్పుడు వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు సమక్షంలో సుమారు 100 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం రాత్రి స్థానిక ముస్లిం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు జియాఉద్దీన్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఇప్పటివరకు ప్రకటించిన వారిలో ఆరుగురు ముస్లిం సోదరులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం ఒక్కరికే ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో 500 కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న గ్రామాల్లో షాదీఖానాలు నిర్మిస్తున్నామన్నారు. అమరావతి మండలంలో ఇప్పటికే 4 షాదీఖానాలు నిర్మించామన్నారు. మరో 16 నిర్మాణంలో ఉన్నాయన్నారు. తనను, ముఖ్యమంత్రి జగనన్నను మనసారా ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో 100 కుటుంబాలు చేరిక

పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు జియాఉద్దీన్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులు స్థానిక ముస్లిం కాలనీ వాసులైన జానీ, అల్లాభక్షు, మస్తాన్, మస్తాన్ వలి, సుభానీ, యాసిన్, నాగుల్ జానీ, మాభూ, రాంబాబు, అక్బర్, బాబు, వలి, కరిముల్లా, బాజీ, జాన్ సైదా, పఠాన్ జానీ, సుభానీ, అష్రాఫ్, మస్తాన్ వలితో పాటు వారి వంద కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, పార్టీ నాయకులు నంబూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్తెనపల్లి: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల చెప్పారు. పట్టణంలోని 30, 1, 2, 29 వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. కొర్రలతో కొన్ని వంటకాలు తయారు చేయించారు. వీటి వలన 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదెమ్మ, వెంకటలక్ష్మి, మిస్సీ కింగ్, జ్యోత్స్న రాణి, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల రైతులకు డ్రమ్ములు, టార్పలిన్‌లు అందజేత



యూనిట్ ఇన్‌చార్జి కె.జ్యోతి, ఐసీ ఆర్పీలు అంకమ్మ, శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజుపాలెం: మండలంలోని గణపవరం యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న డ్రమ్ములు, టార్పలిన్ పట్టాలు, 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు జిల్లా డీపీఎం కె.అమలకుమారి గురువారం అందించారు. ఈ సందర్భంగా అమలకుమారి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, ఎస్ఎఫ్ఏ సంధ్య, ఎంటీ విజయలక్ష్మి,

సెల్ ఫోన్ టవర్‌ను తొలగించండి



సత్తెనపల్లి: మానవాళికి ముప్పుగా ఉన్న సెల్ ఫోన్ టవర్‌ను తొలగింప చేయాలని పట్టణంలోని 28 వార్డ్‌లో గల సాధువమ్మ హాస్టల్ వీధిలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో, తహసీల్దార్ సీహెచ్ ఉషకు, మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. సత్తెనపల్లి పట్టణంలోని 28 వార్డ్‌లో గల సాధువమ్మ హాస్టల్ వీధిలో కొత్త సతీష్ అను వ్యక్తి గత ఆరు నెలల క్రితం స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాకుండా ఎయిర్టెల్ 5జీ నెట్‌వర్క్ సెల్ ఫోన్ టవర్ నిర్మాణం మొదలు పెట్టాడన్నారు. ఈ విషయంపై స్థానికులు, మహిళలు నిరసన తెలిపినా గృహ యజమాని సతీష్ వారి అభ్యర్థనను బేఖాతరు చేస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా సెల్ టవర్ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడన్నారు. తక్షణమే సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.